బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ సంబురాల్లో విద్యార్థినులు

లక్షెట్టిపేట, అక్టోబర్ 16 : లక్షెట్టిపేట పట్టణంలోని వాగేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ.. ఆటలాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డలు ఇష్టంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. యేటా బతుకమ్మ వేడుకలను కళాశాలలో విద్యార్థినుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గడికొప్పుల శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, గడుసు సాగర్, గుజ్జేటి నరేశ్, చంద రమణ, చిలుకూరి వంశీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

దండేపల్లి, అక్టోబర్16 : దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన దాసరి రాజశేఖర్(21) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. రాజశేఖర్ పనికి వెళ్లకపోవడంతో ఖాళీగా ఉంటే ఎలా అని చాలాసార్లు కుటుంబ సభ్యులు మందలించారు. అయినా ప్రవర్తనలో మార్పు రాలేదు. కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 12న గ్రామ సమీపంలోని బ్రిడ్జీ వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తండ్రి సత్తయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తెగులుపై జాగ్రత్తలు తీసుకోవాలి

వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో ప్రేమ్ కుమార్

నెన్నెల, అక్టోబర్ 16 : వాతవరణ ప్రభావం వల్ల వరిలో తెగులు వ్యాసుతందని, రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏవో ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని కుష్నపల్లి గ్రామంలో వరి క్షేత్రాలను సోమవారం పరిశీలించారు. అగ్గి, సుడి దోమ, ఆకు మాడు తెగులు ఆశిస్తుందన్నారు. తెగులు అధికంగా ఉన్నాయని గుర్తించారు. నివారణకు యూరియా వాడకం తగ్గించాలన్నారు. అగ్గితెగులు నివారణకు లీటర్ నీటిలో ట్రై సైక్లోజోల్ 75 శాతం, డబ్ల్యూపీ1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. సుడి దోమ నివారణకు లీటర్ నీటిలో బి ఫ్రోప్యూజల్ 25 శాతం 1.5 ఎంఎల్ కలిపి స్ప్రే చేయాలన్నారు. ఏఈవో రాంచందర్, రైతులు ఉన్నారు.

డెంగీతో మహిళ మృతి

లక్షెట్టిపేట, అక్టోబర్ 16 : మున్సిపాలిటీలోని సత్యసాయి నగర్‌కు చెందిన గోళ్ల మల్లక్క(40) సోమవారం డెంగీతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 12న జ్వరం రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నాలుగు రోజులు చికిత్స తీసుకొని, ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు మళ్లీ జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకురాగా, వైద్యులు పరీక్షించి సీరియస్‌గా ఉన్నదని కరీంనగర్‌లోని ప్రతిమ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, సోమవారం మృతి చెందింది. మల్లక్కకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 13 : బెల్లంపల్లి సీవోఈలో 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాలుగు రోజులుగా 120 మంది విద్యార్థులను బెల్లంపల్లి సీవోఈ క్రీడా మైదానం స్ఫూర్తిదాయకంగా చేసిందన్నారు. ముందుగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కమిషనర్

అండర్-14 విజేతలు..

లాంగ్‌జంప్ విభాగంలో జే సాయికుమార్ (బంగారుపతకం, ఆసిపాబాద్), ఏ సాగర్ (వెండి పతకం, సిర్పూర్(టీ)) పీవిష్ణువర్ధన్ (కాంస్య పతకం, సిర్పూర్(టీ)), హైజంప్‌లో బీ అనీల్‌కుమార్ (బంగారు పతకం, కాసిపేట), ఏ సాయివర్ధన్ (వెండి పతకం, బెల్లంపల్లి), బీ రాకేశ్ (కాంస్య పతకం, కాసిపేట), ఏ సాగర్ (కాంస్య పతకం, సిర్పూర్(టీ))

అండర్-17 విభాగంలో..

లాంగ్ జంప్‌లో కే కార్తీక్ (బంగారు పతకం, సిర్పూర్(టీ)), ఓ పురంజిత (వెండి పతకం, జాకారం), ఎల్ మహేశ్ (కాంస్య పతకం, సిర్పూర్(టీ)), హైజంప్‌లో అఖిల్ రాజ్ (బంగారు పతకం, బెల్లంపల్లి), సందీప్ (వెండి పతకం, జైపూర్), ఎన్ ప్రణయ్ (కాంస్య పతకం, కోటపల్లి)

అండర్-19 విభాగంలో..

లాంగ్‌జంప్‌లో ఎన్ రవితేజ(బంగారు పతకం, కాసిపేట), జీ గణేశ్(వెండి పతకం, కోటపల్లి), ఎం శ్రీకాంత్ (కాంస్య పతకం, ఏటూరు నాగారం), హైజంప్‌లో ఆర్ వంశీ (బంగారు పతకం, సిర్పూర్(టీ)), ఎన్ రవితేజ (వెండి పతకం, కాసిపేట), పీ నరేశ్ (కాంస్య పతకం, జైపూర్) దక్కించుకున్నారు. జోనల్ స్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అండర్-14 విభాగంలో మంథని, అండర్-17 విభాగంలో జాకారం, అండర్-19 విభాగంలో జాకారం విద్యార్థులు సాధించారు.

లాభాల వాటా చెల్లించాలి

తాండూర్, అక్టోబర్ 16 : సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా వెంటనే చెల్లించాలని కోరుతూ టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాప్ డీజీఎం నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. పిట్ కార్యదర్శి కందుల తిరుపతి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వచ్చిందని, లాభాల వాటానుసింగరేణి యాజమాన్యం వాయిదా వేయడం సరికాదన్నారు. ముందస్తు అనుమతులు తీసుకొని చెల్లింపులకు ఆటంకం కాకుండా చూసుకోవాల్సి ఉండేది పేర్కొన్నారు. వాటా, దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్ కొత్తగా ప్రవేశపెట్టే పథకాలు కాదు కాబట్టి, యథావిధిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు రాజేశం, కమిటీ సభ్యులు దాస్, వైకుంఠం, శ్రీనివాస్, రసూల్, రాజేశ్, సురేశ్, రాజం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: ఏరియా వర్క్‌షాప్ డీజీఎం నాగభూషణంకు వినతిపత్రం అందజేస్తున్న పిట్ కార్యదర్శి తిరుపతి, నాయకులు

నల్లబ్యాడ్జీలతో నిరసన..

మందమరి, అక్టోబర్ 16 : లాభాల వాటా వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జే రవీందర్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, రీజియన్ కార్యదర్శి ఓ రాజశేఖర్ యాజమాన్యాన్ని కోరారు. మందమరి ఏరియాలోని వర్క్‌షాప్‌లో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏడబ్ల్యూఎస్ డీవైజీఎం నాగరాజ్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిలో మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, అక్టోబర్ 16 : శాంతిఖని గని వద్ద టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ఏరియా నాయకులు వెంకటరమణ, రాజనాల రమేశ్, మైన్ కమిటీ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సింగరేణి ఏరియా దవాఖానాలో సూపరింటెండెంట్ రామల శౌరికి టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి తనిఖీ సమావేశం

వేమనపల్లి, అక్టోబర్ 16 : వేమనపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ దత్తరావు హాజరయ్యారు. 14 గ్రామాల్లో సెప్టెంబర్ 2021 నుంచి మార్చి 30, 2023 వరకు రూ.3.80 కోట్ల విలువైన పనులు చేపట్టగా, సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించాయి. ఈ సమావేశంలో మస్టర్ల పై కొట్టివేతలు, హరితహారంలో నాటిన మొక్కలు చనిపోవడం, నేమ్ బోర్డులు, రికార్డుల్లో వచ్చిన తేడాలపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్‌కు జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ దత్తరావు అపరాధ రుసుము విధించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, క్లస్టర్ ఏపీడీ శంకరమ్మ, జిల్లా అంబుడ్స్‌మెన్ కామెర శివరాం, క్యూసీ చంద్రశేఖర్, విజిలెన్స్ అదనపు అధికారి కిరణ్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధూకర్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై సమగ్రంగా పరిశీలించాలి

నస్పూర్, అక్టోబర్ 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్రంగా పరిశీలించి, అధ్యయనం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసు నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ప్రొబేషనర్స్ శిక్షణ కార్యక్రమం కోసం ఎఫ్‌టీపీలో భాగంగా జిల్లాకు వచ్చిన బృంద ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి, మంచిర్యాల డీఎల్‌పీవోలు ఫణీందర్‌రావు, ప్రభాకర్‌రావు, ఎంపీడీవో అబ్దుల్ హై, ఎంపీవోలు సబ్దర్ ఆలీ, వేదాల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం సభ్యుల సందర్శన

జీపీ కార్యాలయంలో అధికారులతో కేంద్ర బృందం సభ్యులు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 16 : బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామ పంచాయతీని సోమవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. కేంద్రం నిధులతో జరిపించిన పనులను పరిశీలించారు. అనంతరం వారు స్థానిక పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. కేంద్రం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు కేంద్ర బృందం సభ్యులు నిధుల వినియోగంపై దృష్టిపెడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ రాజేందర్, ఐకేపీ ఏపీఎం శ్యామల, పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తాండూర్, అక్టోబర్ 16 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తాండూర్ శాఖ ఆధ్వర్యంలో అచ్చలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీజీబీ తాండూర్ శాఖ చీఫ్ మేనేజర్ దాముక ప్రభుదాస్ మాట్లాడుతూ.. బ్యాంక్‌కు సంబంధించి జమా ఖాత, లోన్ ఖాత, సాంఘిక సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్, సైబర్ నేరాలు, డిజిటల్ ట్రాన్సాక్షన్స్, బ్యాంక్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవాల గురించి వివరించారు. ఈ సదస్సులో కళాజాతర బృందం, రకరకాల మ్యాజిక్ షోలతో టీజీబీ స్కీమ్‌లను వివరించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది సరిత, రైతులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామసుతలు పాల్గన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీలకు పీఈటీ ఎంపిక

పీఈటీ వరలక్ష్మి

భీమిని, అక్టోబర్ 16 : ఢిల్లీలో 16 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ 2023-24 పోటీలకు రాష్ట్ర జట్టు తరపున భీమిని జడ్పీహెచ్ఎస్ పీఈటీ వరలక్ష్మి పాల్గొననున్నారు. ఈ ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రసాథయి సివిల్ సర్వీసెస్ కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొని, రాష్ట్ర జట్టులో స్థానం సాధించారు. వరలక్ష్మిని డీవైఎస్వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం నాయకులు రామ్మోహన్‌రావు, సిరంగి గోపాల్, గాజుల శ్రీనివాస్, జ్యోతి, మంజుల అభినందించారు.

చెరువులో పడి ఒకరు మృతి

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 16 : చెన్నూర్ పెద్ద చెరువులో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. మహంకాళి వాడకు చెందిన దబ్బెట రాజమల్లు (30) ఓ వ్యాపారి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో పెద్ద చెరువులో పడిపోయాడు. మృతదేహం సోమవారం లభ్యమైంది. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

మందమర్రి, అక్టోబర్ 16: మందమర్రి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సీఐ మహేందర్ రెడ్డి సూచించారు. మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లలో అదనపు(రెండవ) ఎస్ఐలుగా హరిశేఖర్, ఎన్ స్వరూప్‌రాజ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐని మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు సీఐ అన్నారు.